## 'భూములూ,అడవులపై హక్కులకోసం మరింత చైతన్యంతో ఆదివాసీ ప్రజానీకం ఉద్యమించాలి!'

# విజయవంతంగా జరిగిన ఏజెన్సీ గిరిజన సంఘం మహాసభ పిలుపు



జెండా ఆవిష్కరించిన కా॥ఇల్లా రామిరెడ్డి; సభలో అమరులకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

**ఏజెన్సీ** గిరిజన సంఘం మహాసభ అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని కొండమొదలు ఆర్ అండ్ ఆర్ పెద్దకాలనీలో, 8-8-2023న విజయవంతంగా జరిగింది. సంఘాన్ని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసుకోవాలన్న నిర్ణయాల్లో భాగంగా రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) అనుబంధంగా ఉన్న ఏజెన్సీ గిరిజన సంఘం తన మహాసభను జరుపుకున్నది. దీనికి ముందే కొద్ది నెలలుగా సభ్యత్వ నమోదు, గ్రామ కమిటీ ఎన్నికలు జరిగి, ఎంపిక చేసుకున్న ప్రతినిధులతో ఈ మహాసభ జరిగింది. తొలుత ఏజెన్సీ గిరిజన సంఘం జెండా అయిన విల్లు బాణం గుర్తుగా ఉన్న ఎర్రజెండాను గిరిజన సంఘ అధ్యక్షులు కామ్రెడ్ ఇల్లా రామిరెడ్డి ఆవిష్కరించారు. రైతు కూలీ సంఘం జెండాను ఏఐకెఎమ్‌కెఎస్ జాతీయ నాయకులు కామ్రేడ్ ప్రసాదన్న ఆవిష్కరించారు. ఉద్యమ నినాదాలు, పాటలతో ఉత్తేజకర వాతావరణంలో మహాసభ ప్రారంభమైంది. కామ్రేడ్స్ వేట్ల విజయ, తాతి బుల్లెబ్బాయి, వంజం జోగారావులు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలో మొదట కామ్రేడ్ వేట్ల శ్రీరాములు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం ద్వారా ఆదివాసి ఉద్యమంలో అమరులైన సంఘ నాయకులు, కార్యకర్తలకూ, కామ్రేడ్స్ కోటయ్య, జస్వంత్‌రావు, మధు వంటి విప్లవోద్యమ నాయకులకు, ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళులర్పిస్తూ సభ ఒక నిమిషం మౌనం పాటించింది.

తొలుత ప్రారంభ ఉపన్యాసం చేసిన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ మాట్లాడుతూ, కొండమొదలు కేంద్రంగా గిరిజనోద్యమం ప్రారంభమై 54 సంవత్సరాలు అయిందని, ఈ కాలమంతా భూమి కోసం, అడవులపై హక్కు కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటం సాగిందని తెలిపారు. నిరంతరాయంగా వర్గ ఉద్యమంగా సాగిన కొండమొదలు పోరాటం అనేక మలుపుల గుండా సాగుతూ, ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని నిలదొక్కుకున్నదని చెప్పారు. అలాంటి స్థితిలో పోలవరం ప్రాజెక్టు పేర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాచేందుకు, బలవంతంగా తరలించేందుకు పూనుకుందని, చెట్టుకొకరు పుట్టుకొకరుగా కాకుండా, ఐక్యతతో, సంఘటితంగా పోరాడుతూనే అయిష్టంగా ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పడిన ఉద్వేగ వాతావరణంలో ప్రతినిధులు అందరూ ఐక్యతతో నిలబడతామని, ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు. తన అధ్యక్షోపన్యాసాన్ని కొనసాగిస్తూ కామ్రేడ్ ఝాన్సీ, భూమి నీరు అడవులను విదేశాల్లో ఉండే సామ్రాజ్యవాదులు, వారి దళారీలు కొల్లగొడుతున్నారని చెప్పారు. గతంలో కూడా వన సంరక్షణ సమితుల పేర ఇక్కడి నుంచీ ఒరిస్సా వరకూ కొండపోళ్ళలో బలవంతాన ప్లాంటేషన్ మొక్కలు నాటడం చేసారని, వాటిని ఆనాడే వ్యతిరేకించామనీ, ఆదివాసి ప్రజానీకం అనేక ప్రాంతాల్లో వాళ్లదైన పద్ధతులతో అలా మొక్కలు నాటటాన్ని ప్రతిఘటించారని గుర్తు చేశారు. మన అడవి మనకు కాకుండా పోతున్నదంటే అక్కడ సామ్రాజ్యవాదం ఉన్నట్లేనని చెప్పారు. భూమి కోసం కొండమొదలు గిరిజనులు పోరాడుతూ, అనేక ప్రాంతాల పోరాటాలకు ప్రేరణగా నిలిచారని, ప్రస్తుతం ఉద్యమం మరో ముఖ్యమైన మలుపు తీసుకుందని, ఈ మలుపులో మరింత చైతన్యంతో ముందుకు సాగాలని, దానికోసం ఈ మహాసభలో చర్చలు జరగాలని కోరుతూ ముగించారు.

రైతుకూలీసంఘం తెలంగాణ నాయకులు కామ్రేడ్ ప్రసాదన్న మాట్లాడుతూ ఇంతకాలం ఈ ఉద్యమం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని కూడా కొనసాగుతూ ఉండటం చిన్న విషయం కాదని, ఈ పోరాటాన్ని కొనసాగించాలని, రాబోయే కాలంలో ఎదురయ్యే సరికొత్త సవాళ్లు ఎదుర్కోవాలని కోరారు.

తెలంగాణ ప్రాంతంలో కూడా కొండపోళ్ళ కోసం ఆందోళన కొనసాగుతుందని చెపుతూ, మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ముగించారు. అనంతరం ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.ఎన్ స్వామి మాట్లాడుతూ కొండమొదలు గిరిజన ఉద్యమం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, ఈనాడు కార్మికోద్యమం పాలకుల అనేక రకాల దాడులు ఎదుర్కొంటుందని, పోరాడుతున్న ఆదివాసి ప్రజానీకానికి కార్మిక వర్గం అండదండలు ఉంటాయని చెబుతూ ముగించారు.

అధ్యక్షవర్గం ద్వారా ప్రవేశపెట్టిన మహాసభ కార్యకలాపాల నివేదిక ఇప్పటి వరకూ ఏఏ ముఖ్యమైన మలుపులలో గిరిజన సంఘ మహాసభలు జరిగాయో సంఘ భూముల స్వాధీన విధానం, గిరిజనేతర పేదలకు కూడా మన భూములు ఇచ్చి మనతో పాటు బతకమన్న గిరిజన – గిరిజనేతర విధానం, స్వాధీనం చేసుకొన్న భూములలో సమిష్టి పంటల విధానంతో మొదలుపెట్టి కుటుంబాల వారీగా భూములు పంచడం, పంటలో కొంత తీసివుంచి మరల తిండికి ఎద్దడి కాలంలో అందరూ కలసి పంచుకొనే పంటల వాటా విధానం వంటివి అన్నీ మహాసభలలో అందరి ఉమ్మడి నిర్ణయాలుగానే తీసుకొనబడినాయని, అందుకే దశాబ్దాలపాటు ఆ నిర్ణయాలు తిరుగులేకుండా అమలు అయ్యాయని పేర్కొంది. ప్రస్తుతం ఎదుర్కొనబోతున్న కొత్త సవాళ్ళను ఎదుర్కొ నేందుకు ఇంకా ఉన్నత చైతన్యం అవసరమని నివేదిక చెప్పింది. అలాగే ప్రతి మహాసభలో అప్పటి వరకూ జరిగిన జమా ఖర్చులు మహాసభ ముందుంచి జరిగిన విషయాలు ముందుంచడం సాంప్రదాయం. దాని ప్రకారం ప్రభుత్వం, భూస్వామ్యశక్తులు మన మీద ఆర్థిక భారాలు మోపి దెబ్బతీసేలా కేసులు పెడుతూ ఉంటే ప్రజల అండతో వాటిని ఎదుర్కొన్న తీరును ఆర్థిక నివేదిక వివరించింది. ఈ నివేదికలపై చర్చ అనంతరం వీటిని మహాసభ ఆమోదించింది. తర్వాత మహాసభ నూతన నాయకత్వ కమిటీని ఎన్నుకుంది కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి గౌరవ అధ్యక్షులుగా, కామ్రేడ్ వేట్ల విజయ అధ్యక్షులుగా, 36 మందితో నూతన కార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకొంది.

మహాసభ యొక్క ముఖ్యమైన ఎజెండా ముగిసిన అనంతరం, విజయవంతమైన మహాసభకు ముగింపు ఉపన్యాసం ఇస్తూ, కామ్రేడ్ ఝాన్సీ మహాసభ విజయవంతమైనందుకు అభినందించారు. మూడు విషయాలను ఈ మహాసభ అందించిందని 1. భూములనూ, పూర్తి పునరావాసాన్ని సాధించుకోవడం, 2. సంఘంలో, కుటుంబంలో వచ్చిపడుతున్న చెడు ప్రభావాలకు వ్యతిరేకంగా యువకులను ఐక్యపరచడం, 3. ప్రభుత్వాల యొక్క అటవీ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను కొనసాగించాలని చెప్పారు. అలాగే అర్ధశతాబ్దపు కొండమొదలు ఉద్యమ చరిత్రను వివరించే పుస్తకాన్ని మర్నాడు ఆవిష్కరించుకోబోతున్నామని చెప్పారు. ఈ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోయేందుకు నూతన కమిటీ నాయకత్వాన ముందుకు సాగాలని కోరుతూ ముగించారు. రైతు కూలీ సంఘ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎంఎస్ నాగరాజు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు పునరావాసం కోసం సాగించిన పోరాటంలోని ముఖ్యమైన ఘట్టాలను, రాజద్రోహ కేసులను ఎదుర్కొన్న తీరును వివరించారు. పునరావాసం కోసం సాగిన సంఘర్షణనూ వివరించే పుస్తకాన్ని రాష్ట్ర రైతుకూలీ సంఘం తీసుకొని వచ్చిందని చెపుతూ ముగించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ వర్మ యువతరం యొక్క పాత్ర ఈ మహాసభలో కూడా వారు పాల్గొన్న తీరుతో వెల్లడైందని, ఇప్పటికి నాలుగు తరాలు ఈ ఉద్యమ జెండా నీడలో నడిచాయని, భవిష్యత్తరాలు కూడా, ఆదివాసుల అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం కొనసాగుతుందనే విశ్వాసం కలుగుతుందని చెబుతూ ముగించారు. కామ్రేడ్ లలిత దేశవ్యాప్తంగా సాగుతున్న రైతాంగ ఉద్యమాలను ప్రస్తావిస్తూ కొండమొదలు ఉద్యమం ముందుకు సాగాలని కోరారు. రై.కూ.సం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ శ్రీను నాయుడు కొండమొదలు ఉద్యమ ప్రేరణతో విజయనగరం జిల్లా రైతుకూలీ ఉద్యమం మొదలై సాగుతున్నదని వివరించగా, కామ్రేడ్ భాష పశ్చిమ గోదావరి గిరిజనోద్యమం కొండమొదలు ఉద్యమ కొనసాగింపుగా జరిగిన తీరును, కొనసాగుతున్న క్రమాన్ని వివరించగా, వీరందరూ మహాసభ విజయవంతమైనందుకు అభినందలు తెలిపారు.

అనంతరం మహాసభ ఈ క్రింది సాధారణ తీర్మానాలను ఆమోదించింది. 1. భూమి కోసం, జీవించే హక్కు కోసం ఐక్యంగా పోరాడటం తప్ప ఆదివాసులకు మార్గం లేదనీ, భూముల కోసం ముందుకు సాగాలని ఆదివాసులకు పిలుపునిస్తూ, 2. కొండపోడు హక్కులను ఆదివాసి హక్కుల చట్టాలను ఎత్తివేస్తూ పాలకులు తీసుకొచ్చిన అటవీ సంరక్షణ సవరణ చట్టాలను వ్యతిరేకించాలని ఆదివాసులను కోరుతూ, 3. పోలవరం ప్రాజెక్టు పేరిట నిర్వాసితులను కాంటూరు వారీగా విభజిస్తూ నిరంతరం ముంపులకు గురి చేస్తున్న ప్రభుత్వాల విధానాలను ఖండిస్తూ, సమగ్ర పునరావాసం కోసం నిర్వాసితులు తమ పోరాటాలను ఐక్యంగా కొనసాగించాలని పిలుపునిస్తూ, 4. కోర్టులను అడ్డం పెట్టుకుని జీవో నెంబర్ 3 వంటి వాటిని పాలకులు రద్దు చేస్తున్న సమయంలో ఆదివాసీ, విద్యార్థి నిరుద్యోగ ప్రజానీకం, అందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం ఉద్యమించాలని విద్యార్థి యువకులకు పిలుపునిస్తూ, 5. మణిపూర్లో ఆదివాసులపై సాగుతున్న ఘాతుకాలన్నీ అక్కడి సహజ వనరులను కొల్లగొట్టడం కోసమేననీ, జాతులు, తెగల మధ్య పాలకులు పెడుతున్న చిచ్చులను తిప్పికొట్టాలని ఆదివాసి ప్రజానీకానికందరికీ పిలుపునిస్తూ, విద్య, వైద్యం తదితర అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అదేవిధంగా 30-7-23న

విజయవాడలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా జరిగిన సదస్సులో, పునరావాస సమస్యలపైనా, అటవీ చట్టాలపైనా తీర్మానాలు చేసినందుకు రైతాంగ సంఘాల సమన్వయ సమితికి అభినందలు తెలుపుతూ మహాసభ తీర్మానం చేసింది. అనంతరం సంఘ అధ్యక్షులు కామ్రేడ్ వేట్ల విజయ ఈ మహాసభకు సహకరించిన అందరకీ అభివందనాలు తెలిపారు. బాలసంఘం పాటలూ, కొండమొదలు ఉద్యమ పాటలూ, నినాదాలతో మహాసభ విజయవంతంగా ముగిసింది.

*****